నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 13 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



ఓరియంటల్ రాబిన్



కార్మోరాంట్



సర్పెంట్ ఈగల్

# కవ్వాల్ కనువిందు

- బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కు విశేష స్పందన
- తరలివచ్చి తిలకించిన పక్షి ప్రేమికులు



కవ్వాల్‌లోని బైసన్ కుంట అందాలను వీక్షిస్తున్న హైకోర్టు స్పెషల్ ఫీడర్ స్వరూప్, ఏజీపీ రవికుమార్

జన్నారం, జనవరి 12 : కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్ట్‌లోని జన్నారం, తాళ్లపేట్‌రేం జ్ పరిధిలోని గోండుగూడ, బైసన్‌కుంట ప్రాంతంలో రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కు విశేష స్పందన వచ్చింది. నిర్మల్, గుంటూర్, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అతిథులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి దట్టమైన అడవి అందాల ను తిలకిస్తూ ముందుకు సాగారు. అక్కడక్కడా పక్షులు కిలకిలారావాలతో కనువిందు చేయగా, వారికి కొత్త అనుభూతినిచ్చింది. వాటిని కెమెరాల్లో చిత్రీకరించారు. ఓరియంటల్‌రాబిన్, సర్పెంట్ ఈగ ల్, ఊలినెక్డ్ స్టార్క్, సిల్వర్ బిల్స్ బర్డ్స్, గ్రేహెరాన్, కార్మో రాంట్‌తో పాటు మరో 39 రకాల పక్షులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. డీఆర్వో తిరుప తి, చింతగూడ సెక్షన్ ఆఫీసర్ నహిద, ఎఫ్‌బీవోలు లాల్ బాయి, శివ, సాయి ఉన్నారు.




ఊలినెక్డ్ స్టార్క్ బర్డ్స్

**సందర్శించిన హైకోర్టు స్పెషల్ ఫీడర్**

కవ్వాల్ టైగర్ రిజర్వుడు డివిజన్‌లోని జన్నారం రేంజ్ పరిధిలోని గోండుగూడ, బేస్ క్యాంప్, బైసన్ కుంట ప్రాంతాల్లో హైదరాబాద్‌కు చెందని హైకోర్టు స్పెషల్ ఫీడర్ స్వరూప్, ఏజీపీ రవికుమార్ తమ కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. రేంజ్ ఆఫీసర్ సుష్మారావు వారికి వన్యప్రాణులకు కల్పిస్తున్న ఆహారం, నీటి వసతులు, గడ్డి క్షేత్రాలు, వాచ్ టవర్స్‌తో పాటు నీటి కుంటలు, అరుదైన పక్షుల గురించి వివరించారు.



బర్డ్‌వాక్‌కు హాజరైన పక్షి ప్రేమికులు



గ్రేహెరాన్



ఇండియన్ సిల్వర్ బర్డ్స్

## ఎంసీహెచ్‌కు వ్యాక్సిన్లు

మంచిర్యాల అర్బన్, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 'వ్యాక్సిన్ల కొరత' ఏర్పడిందంటూ శనివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో డా.హరీశ్‌రాజ్ ఆదివారం స్పందించారు. జిల్లాలో వ్యాక్సిన్ల కొరత లేదని, పుట్టిన పిల్లలకు వేసే బీసీజీ, హెపటైటిస్–బీ, ఓపీవీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, 10, 14 వారాల పిల్లలకు వేసే వ్యాక్సిన్లు శనివారం అందుబాటులో లేకుండేనని, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తెప్పించామని, అన్ని వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. త్వరలో మిగతా కేంద్రాలకు పంపిస్తామని వెల్లడించారు. ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.

● 'నమస్తే'కు స్పందన


ఎంసీహెచ్‌లో వ్యాక్సిన్ల కొరత..!

నమస్తే తెలంగాణలో ప్రచురించిన కథనం




# స్థానిక సంస్థలకు సన్నద్ధం..!

### మంచిర్యాల జిల్లాలో మూడు విడుతల్లో జీపీ ఎన్నికలు

- వార్డుల వారీగా ఓటరు జాబితా ప్రదర్శన ● 3,777 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం
- 2,730 పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- సర్పంచ్‌లకు 30కి పైగా.. వార్డు సభ్యులకు 20 గుర్తులు
- ఇక మిగిలింది రిజర్వేషన్ల ఖరారే ● ఆశావహుల్లో టెన్షన్

హాజీపూర్, జనవరి 12 : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే వార్డుల వారీగా ఫొటోతో కూడిన ఓటరు లిస్టును ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించింది. ఇక్కడ ఉన్న బ్యాలెట్ బాక్స్‌లతో పాటు మహారాష్ట్ర నుంచి మరి కొన్నింటిని తీసుకువచ్చి భద్రపర్చింది. జిల్లాలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలుండగా, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. మొదటి విడుతలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి మండలాల్లో, రెండో విడుతలో చెన్నూర్ నియోజక వర్గంలోని చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి, మందమర్రి మండలాల్లో, ఇక మూడో విడుతలో మంచిర్యాల నియోజకవర్గంలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. మొత్తం 2,730 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేయగా, ఎన్నికల నాటికి ఆయాచోట్ల ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చెయిర్ తదితర సౌకర్యాలు కల్పించనున్నది.

**సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు**

సర్పంచ్ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో ఉంటుంది. నోటాతో పాటు 30 గుర్తులు బ్యాలెట్ పేపర్‌లో ముద్రించనున్నారు. 30 కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే మరో బ్యాలెట్ పేపర్ ముద్రించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సర్పంచ్ అభ్యర్థికి ఉంగరం, బ్యాట్, కత్తెర, లేడీ పర్స్, ఫుట్‌బాల్, టూత్‌పేస్టు, టీవీ రిమోట్, నల్లబోర్డు, చెత్తడబ్బా, స్పానర్, బెండకాయ, నల్లబోర్డు, వజ్రం, కొబ్బరి తోట, హ్యాండిల్, డోర్, బకెట్, టీకప్పు, జల్లెడ, చేతి కర్ర, పలక, మంచం, టేబుల్, బ్రష్, టార్చిలైట్, బ్యాట్స్‌మెన్, బిస్కెట్, ఫ్లూట్, పడవ, చెప్పులు, చైన్, బెలూన్, స్టంప్స్ తదితర గుర్తులుంటాయి.

**వార్డు సభ్యుల గుర్తులు**

ఇక వార్డు సభ్యుల ఎన్నికలకు బ్యాలెట్ పేపర్ తెలుపు రంగులో ఉంటుంది. ఇందులో 20 గుర్తులతో పాటు ఒక నోటాతో పాటు మొత్తంగా 21 గుర్తులుంటాయి. గౌను, గ్యాస్ పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలిండర్, కుండ, ఈల, గరిట, డిష్‌యాంటీనా, మూత, గరిటె, గాజు గ్లాసు, ఐస్‌క్రీం, కవరు, పోస్టు డబ్బా, నెక్‌టై, హాకీ కర్రబంతి, పెట్టె, కటింగ్ ప్లేయర్, కేటిల్, విద్యుత్ గుర్తులుంటాయి.

**రిజర్వేషన్లపై ఆసక్తి**

2019లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగగా, అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామ సర్పంచ్ రిజర్వేషన్లు పదేళ్లపాటు కొన సాగుతాయని ప్రకటించింది. ఇక ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రిజర్వేషన్లు మార్చాలని చూస్తున్నది. బీసీలకు రిజర్వేషన్లు పెంచే దిశగా ఆలోచిస్తున్నది. స్థానిక సంస్థల్లో రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా ఉంటాయో అని ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. రొటేషన్ పద్ధతిలో అయితే ప్రస్తుతమున్న రిజర్వేషన్లు పెంచేందుకు మారుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటన వస్తే ఎవరు పోటీలోకి వస్తారో అనే చర్చ సాగుతున్నది.

| | |
|---|---|
| మండలాలు | 16 |
| గ్రామ పంచాయతీలు | 311 |
| వార్డులు | 2,730 |

| | |
|---|---|
| మహిళా ఓటర్లు | 1,94,688 |
| పురుష ఓటర్లు | 1,94,039 |
| ఇతర ఓట్లు | 19 |
| మొత్తం ఓటర్లు | 3,88,746 |

**బ్యాలెట్ బాక్స్‌లు**

| | |
|---|---|
| జంబో | 1,018 |
| పెద్దవి | 324 |
| మధ్యరకం | 1,556 |
| చిన్నవి | 879 |
| మొత్తం | 3,777 |

**ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహిస్తాం**



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎప్పుడు ఆదేశించినా గ్రామ పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఓటరు లిస్టు, బ్యాలెట్ బాక్స్‌లతో పాటు పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచాం. జిల్లాలో పది రోజుల వ్యవధిలో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహిస్తాం. - వెంకటేశ్వర్‌రావు, డీపీవో, మంచిర్యాల



లారీల్లో మొరం నింపుతున్న ఎక్స్‌కవేటర్

# అభివృద్ధి పేరిట అక్రమ రవాణా

- బొప్పారంలోని ప్రభుత్వ భూమి నుంచి యథేచ్ఛగా మొరం తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని మైనింగ్ అధికారులు

నెన్నెల, జనవరి 12 : కొందరు కాంట్రాక్టర్లు అభివృద్ధి పేరిట అక్రమ మొరం దందాకు తెరలేపారు. యథేచ్ఛగా లారీల్లో తరలిస్తూ సర్కారు ఆదాయానికి గండికొడుతున్నారు. ఇంటిముందు పోసుకోవడానికి ట్రాక్టర్ టిప్పునకు అనుమతివ్వని మైనింగ్ అధికారులు, ఈ విషయంలో మాత్రం నోరుమెదపకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నెన్నెల మండలం బొప్పారం ప్రాంతంలోని సర్వే నంబర్ 674లోగల ప్రభుత్వ భూమిలోని మొరాన్ని అక్రమంగా తరలించుకుపోతున్నారు. బెల్లంపల్లి మండలం చంద్రపెల్లి గ్రామానికి వేస్తున్న రోడ్డు కోసం వాడుతున్నారు. మొరం తరలింపు కోసం మొదట కాంట్రాక్టర్ నామమాత్రంగా రెవెన్యూ అధికారులను కలిసి అనుమతులు కావాలని అడిగాడని, వారు ఆర్డీవో, కలెక్టర్ వద్ద అనుమతులు తీసుకోవాలని చెప్పారని తెలిసింది. కానీ సదురు కాంట్రాక్టర్ ఇవేమీ పాటించకుండా స్థానిక నాయకుల పేరు చెప్పి ప్రతి రోజూ దాదాపు 50 లారీల్లో మొరం తరలిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే నా ఇంటికి తీసుకుపోతున్నానా.. రోడ్డు కోసమే కదా అంటూ నిర్లక్ష్యపు సమాధానమిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు.



మొరంతో తరలుతున్న లారీలు

అక్రమంగా మొరం తరలిస్తున్నారంటూ అధికారులకు సమాచారమిచ్చినా ఫలితం లేకుండా పోతుందని బొప్పారం రైతులు చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ అధికారిని ఫోన్ ద్వారా సంప్రదిస్తే స్పందించలేదు. నెన్నెల ఆర్ఐ సూలోచనను అడుగగా, అక్రమంగా మొరం తరలిస్తున్న విషయం తెలిసిందని, ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న విషయంపై విచారణ చేపడుతామన్నారు.

# వైభవంగా జంగుబాయి జాతర

**నేడు అమ్మవారి గుహవద్ద మహాపూజ, దర్బార్**

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, జనవరి 12 : సహ్యాద్రి పర్వతాల్లోని గుహలో కొలువైన జంగుబాయికి భక్తులు నీరాజనం పలుకుతున్నారు. ఈ నెల 2న ప్రారంభమైన జాతరకు ఆదివాసులు పోటెత్తుతున్నారు. ఆదివారం తెలంగాణ, మహారాష్ట్రల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ, రావుడ్‌కపేన్, మైసమ్మ వద్ద మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రంతా అక్కడే బసచేశారు. ఇక సోమవారం అమ్మవారి వద్ద మహాపూజ, దర్బార్ నిర్వహించనుండగా ఏర్పాట్లు చేశారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మా బొజ్జు హాజరుకానున్నారు.



జంగుబాయి ఆలయానికి తరలివస్తున్న భక్తులు




నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

# నల్ల బ్యాడ్జీలతో నిరసన

బెల్లంపల్లి, జనవరి 12 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బెల్లంపల్లిలోని వంద పడకల దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు. యూనిఫామ్, ఐడీ కార్డులు ఇవ్వడం లేదని ఆరోపించారు. సిబ్బంది పట్ల కాంట్రాక్టర్ తీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, మల్లీశ్వరి, జానకి, చంద్రకళ, విజయ తిరుమల, మంగ శ్రీకాంత్, షేక్ ఇబ్రహీం, అన్వర్, మాధవి, పద్మ దేవేంద్ర పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం

*దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో రోజంతా సందడి కనిపించింది. విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలకు హాజరయ్యారు. నాటి తీపి గుర్తులను నెమరేసుకున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. ఊరికోసం, పాఠశాల అభివృద్ధి కోసం సహకరిస్తామని తెలిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. - దండేపల్లి, జనవరి 12*



అప్పటి గురువులతో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు